# న్యాయవాది

## యస్సార్ తురగా

ఆ సాయంత్రం. చిరుచీకట్లు అలుముకున్నాయి. గదిలో లైట్లు వెలిగాయి. చీకట్ని పారదోలింది వెలుగు. ఆఫీసు గదిలో కూచుని ఉన్నాడు న్యాయవాది గిరిధర్. రేపు కోర్టులో వాదించాల్సిన కేసు వివరాల్ని చూస్తున్నాడు. పాయింట్స్‌ని, వివరాల్ని నోట్ చేసుకుంటున్నాడు.

"సార్ మీ కోసం కొండయ్య వచ్చాడు" అన్నాడు ఆఫీసుబోయ్ వినయంగా.

"లోపలికి పంపించు" అన్నాడు గిరిధర్ తలపైకెత్తి, కళ్ళజోడు సవరించుకొంటూ.

"దండాలు బాబు" అన్నాడు కొండయ్య లోపలికి అడుగు పెడుతూ.

"ఏం కొండయ్యా, అమ్మాయి ఆచూకేమైనా తెలిసిందా?"

"లేదు బాబు"

"అలాగా?"

"నా బిడ్డ ఎటుపోయిందో, ఏమైందో" అంటూ వలవల ఏడ్చాడు. కన్నీళ్ళు కాలువలు కట్టాయి. ఎండిన కొండయ్య శరీరంలోకూడా అన్ని కన్నీళ్ళు దాగున్నాయంటే గిరిధర్‌కి కాస్త ఆశ్చర్యమేసింది. తల్లి తండ్రుల — బిడ్డల మధ్య ఉండే అనుబంధం అంత గట్టిది. శరీరాల తత్వాలతోగాని, ఆర్థిక స్థితిగతులతోగాని ప్రమేయంలేదు. కాకి బిడ్డ కాకికి ముద్దు.

"కొండయ్య ఏడిస్తే అమ్మాయి దొరుకుతుందా? నా ప్రయత్నమేదో నేను చేస్తూనే ఉన్నానుగా" అన్నాడు ఓర్పుగా ఓదార్పుగా. "బాబుగారు, నాకు మీరే దిక్కు. నా బిడ్డ ఎక్కడుందో ఎన్ని యాతన్లు పడుతూ వుందో" అన్నాడు విలవిలలాడిపోతూ.

"కొండయ్య యిహ నువ్వు ఇంటికెళ్ళు, నీ బిడ్డను వెదికే పూచీ నాది"

"బాబుగారు మీరే కాపాడాలి. నా బిడ్డని పానాలతో పట్టుకొవాలి" అంటూ మెరుపులా వచ్చి గిరిధర్ కాళ్ళమీద పడిపోయాడు. పాదాల్ని కన్నీటితో తడిపేశాడు కొండయ్య. లాయర్ హృదయం గతుక్కుమంది. మనసు నీరైపోయింది.

"కొండయ్యా లే, నువ్వు నా తండ్రిలాంటివాడివి. కన్నతండ్రిగా నీ బాధ నాకు తెలియందికాదు. నీ లాంటి పేదల కష్టనష్టాల్ని పంచుకోవడం కోసమేగా, ఇంత కష్టపడి లాయరైంది. నాకు మీ శ్రేయస్సు, సుఖం కంటే వేరే లక్ష్యమేముంది?" కొండయ్యను పైకిలేపాడు. కన్నీళ్ళు తుడిచాడు. ధైర్యం చెప్పాడు. నచ్చచెప్పి మెల్లగా ఇంటికి పంపించాడు న్యాయవాది గిరిధర్. గిరిధర్ మూడ్ పోయింది. మనసు వికలమయింది. పేదలు దీనులు, దరిద్రులు, పరాధీనులు వాళ్ళకు బ్రతుకే సమస్య. పొట్టకూటికే వాళ్ళ పాట్లు, అగచాట్లు. అవి చాలవన్నట్లు ఇలాంటి సామాజిక సమస్యలుకూడా తలెత్తితే వాళ్ళేంగాను? వాళ్ళ జీవితాలెలా గడుస్తాయి. మనశ్శాంతి ఎలా చేకూరుతుంది?

బలవంతుడు బలహీనుడ్ని దోచుకోవడం ఆటవిక న్యాయమైతే, తెలివిగలవాడు తెలివితక్కువవాడిని దోచుకోవడం ఏమౌతుంది? నాగరికత లక్షణమా? చిహ్నమా??

గణగణమని టెలిఫోన్ మోగింది.

"హల్లో, గిరి స్పీకింగ్" అన్నాడు రిసీవర్ పైకెత్తి.

"... ... ..."

"మీరేం వెనుకాడవద్దు. ఎంత ఖర్చయినా భరిస్తాను"

"...... ... .."

"డాక్టర్ ఈ పూట కాస్త బిజీగా వున్నాను. రేపు ఉదయాన్నే వచ్చి మిమ్మల్ని హాస్పిటల్లో కలుస్తాను"

"... ... ..."

"అలాగే థ్యాంక్యూ" టెలిఫోన్ పెట్టేశాడు గిరిధర్. మనుష్యుల్లో జ్ఞానం పెరిగే కొద్దీ, అంతకు రెట్టింపు స్వార్థం పెరగడం ఈ రాకెట్ యుగ లక్షణం కాబోలు గొణుక్కున్నాడు గిరిధర్.

"వీరయ్య అతని భార్య మీకోసం వచ్చారు సార్" అన్నాడు బోయ్.

"పంపించు లోపలికి"

"బాబుగోరు నా కొడుకు రంగడ్ని పోలీసోళ్ళు పటుకుపోయారు" అంటూ వీరయ్య దంపతులు ఏడ్పులు, పెడబొబ్బలు మొదలెట్టారు.

"అసలేం జరిగింది?" కాస్త చికాగ్గానే అడిగాడు గిరిధర్.

"నా కొడుకు రిచ్చా తొక్కుతాడుగద బాబు. ఎవరిదో ప్యాసింజరిది సంచి పోయిందట, అందుకని రంగడ్ని పట్టుకొని నానా యాతన్లు పెడుతున్రు పోలీసోళ్ళు" అన్నాడు రుద్ధ కంఠంతో.

"మరి రంగడు సంచి తీశాడంటవా?"

"అసువంటి దొంగబుద్దులు మా రక్తంలో లేవు బాబు, వాడెసువంటివాడో తమరికి తెల్దాబాబు" అన్నారు కళ్ళొత్తుకుంటూ.

"మరి రంగడ్ని పోలీసులు ఎందుకు పట్టుకున్నట్లు?"

"ఆడిమీద అనుమానమంటబాబు" అన్నాడు వీరయ్య వినయంగా చేతులు కట్టుకొని.

చిరిగిన బట్టలు, చివికిన శరీరాలు, చీకటి ముఖాలు, చిందరవందర ఆకారాలు చూసి గిరిధర్‌కు జాలేసింది. రంగడు తనకు తెలుసు. అతడలాంటివాడుకాదు. చాలా అమాయకుడు. అనుమానం మీద అనవసరంగా, అమానుషంగా హింసించడం పోలీసులకు కొత్తకాదు. రోజా పేపర్‌నిండా కన్పించేవి, వినిపించేవి ఇలాంటి విషయాలే. ఎవరి విషయమో ఎందుకు తన తండ్రి పోలీసులతో ఎంత బాధపడ్డారో.

గిరిధర్ ఆవేశం, ఆవేదనతో చలించి పోయాడు. వెంటనే పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేశాడు.

"హల్లో, లాయర్ గిరిని మాట్లాడుతున్నాను"

"ఎస్ ఇన్స్‌పెక్టర్ ప్రతాప్ స్పీకింగ్" అంది అవతలి కంఠం.

"మీ కస్టడీలో రంగడనే రిక్షా డ్రైవర్ ఉన్నాడా?"

"ఉన్నాడండి"

"అతనిమీద అభియోగమేమిటి?"

"ఒక వి.ఐ.పి బంధువు బ్యాగ్ పోయింది. ఆ సమయంలో రంగడు స్టాండులో వున్నాడు"

"ఉన్నంతమాత్రానా తప్పుచేసినట్టా?"

"అ..ది కాదం...డి"

"ఏదికాదు? అతను దొంగతనం చేసినట్లు మీ దగ్గరేదైనా రుజువుందా? లేనప్పుడు అతన్ని అదుపులోకి తీసుకోవడం అన్యాయంకదూ? వాడ్ని నమ్ముకొని బ్రతికేవాళ్ళ గతేంకాను?"

"అతను..."


"నాకు మీరింకేం చెప్పొద్దు. అతన్ని వెంటనే విడుదల చేయండి. లేకపోతే కోర్టుకెళ్ళాల్సి వస్తుంది. పేదవాళ్ళని మీరు చీటికి మాటికి ఇలా సతాయించడం ఏం బాగోలేదు".

"మీరు చెప్తున్నారుకదా, రంగడ్ని వదిలేస్తున్నాంలెండి" ఫోను పెట్టేశాడు ఇన్స్‌పెక్టర్.

క్రిమినల్ లాయర్ గిరంటే ఊళ్ళో అందరికీ తెలుసు.

**పేటలోని బట్టలన్నీ గిరి తండ్రే కుట్టేవాడు. అందరికీ నోట్లో నాలుకగా ఉండేవాడు. రోజా దినపత్రిక చదవడం అందరికీ వినిపించడం అతని దినచర్య. అందరిలో కాస్త చైతన్యం, విచక్షణాజ్ఞానం కలిగించాలని అతని అభిలాష.**

అతను కేసు టేకప్ వేశాడంటే అందులో న్యాయం, కేసులో బలం విధిగా వుంటుందని. అతను కేసు వేపడితే ఎలాగైనా నెగ్గుకొస్తాడని.



"వీరయ్య మీరిహ ఇంటికెళ్ళవచ్చు. రంగడ్ని వదిలేస్తున్నారు" అన్నాడు గిరిధర్ ఉత్సాహంగా ఉద్రేకంగా.

"మీరే లేకపోతే మాలాంటి పేదోళ్ళ గతేంకాను బాబు"

"మీరేమిటి, నేనేమిటి మనమంతా ఒకటే, వెళ్ళండి" అన్నాడు మనస్ఫూర్తిగా ధైర్యాన్ని ఇస్తూ.

"అట్టాగేబాబూ" అన్నారు వీరయ్య దంపతులు వంగి

వంగి నమస్కారాలు పెడ్తూ పెన్నిధి దొరికినంత సంబరపడిపోతూ వెళ్ళారు.

ఆ రోజుల్లో, గిరిధర్ తండ్రికి ఇదే పేటలో ఒక దర్జీ దుకాణం ఉండేది. గిరి ఆరవతరగతి చదువుతున్నాడు.

పేటలోని బట్టలన్నీ గిరి తండ్రే కుట్టేవాడు. అందరికీ నోట్లో నాలుకగా ఉండేవాడు. రోజూ దినపత్రిక చదవడం, అందరికి వినిపించడం అతని దినచర్య. అందరిలో కొత్త చైతన్యం, విప్లవజ్ఞానం కలిగించాలని అతని అభిలాష. వాళ్ళ కష్టాల్లో పాలుపంచుకోవడం, పురోభివృద్ధికి యథావిధిగా పాటుపడడం అతని ధ్యేయం. కానీ మిగతా పెద్దలకు ఈ విషయం గిట్టేదికాదు.

బతకడానికొచ్చి, గంగిగోవుల్లాంటి పేదల్ని పాడుచేస్తుండు ఈ రాజుగాడు" అనేవాడు అప్పటి ఆ వార్డు కౌన్సిలర్.

"రాజన్నా నువ్వు మంచి తెలివిగలోడివి, పైకి రావల్సినోడివి, నీకెందుకన్నా ఈ పేదంతా? ఏదో ఛాన్సు దొరికితే నాలుగురాళ్ళు వేసుకోక" అనేవాడు బస్తీ లీడర్ యాదగిరి.

"యూనియన్లు లేబర్ అంటూ వాళ్ళను రేపిపోవడం మానిపోసి మాకు తలనొప్పి తేకు. దీపం ఉన్నప్పుడే ఇల్లు సర్దుకో" అని కన్నుగీటేవాడు ఆ పేటలోవాళ్ళు పనిచేసే మిల్లు యజమాని.

"నువ్వు పేద విషయంలో తలదూర్చి మాకు అడ్డుపడ్డావంటే నీ ఎముకలు విరుస్తాం జాగ్రత్త" అని బెదిరించి హెచ్చరించేవాడు లోకల్ దాదా.

"మా వ్యాపారాలన్నీ నీవల్ల దెబ్బతినిపోతున్నాయి.

మా దారికడ్డం వస్తే పైకి పోతావు'' అని భయపెట్టేవారు గుడుంబా, నాటుసారాయి దొంగ వ్యాపారస్తులు. ఆ వాడలోని ప్రజల్లో ఎక్కువభాగం నిరుపేదలు అమాయకులు, నిరక్షరాస్యులు. వాళ్ళ అజ్ఞానాన్ని అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని దోచుకోవాలనే పెద్ద మనుష్యులు కొంతమంది. వాళ్ళ మార్గాన్ని సుగమం చేసుకోవాలంటే గిరిధర్ తండ్రి రాజుని అడ్డు తొలగించాలి. అందుకే ఎవరికి తోచిన విధంగా వారు హెచ్చరికలు, ఉపదేశాలు, ఉపన్యాసాలు, నయాన భయాన ఇచ్చేవారు. కానీ రాజు వీళ్ళను లక్ష్యపెట్టేవాడుకాదు. వాళ్ళ ధనబలంతో రాజును ముప్పతిప్పలు పెట్టేవారు. దొంగతనాలు చేయించాడనో, దోపిడీ ముఠాలతో సంబంధం ఉందనో, సంఘ విద్రోహ శక్తులతో చేతులు కలిపాడనో, మతకల్లోలాలు రేపాడనో—ఇలాంటి కేసుల్లో అతన్ని ఇరికించేవారు. అతని సమయమంతా పోలీసు స్టేషన్లకు, కోర్టులకు తిరగడంతోటే సరిపోయేది. తిండికి కూడా జరిగేదికాదు. అతని భార్య ఏదైనా పనిపాట్లు చేసి ఇంత తెస్తేనే తిండి, లేకపోతే పస్తులే. డబ్బుతో చట్టాల్ని తమకు అనుకూలంగా ఎలా తిప్పుకుంటారో అమాయకుల్ని ఎలా సతాయించి దోచుకొంటారో గిరిధర్ తండ్రికి బాగా అవగతమైపోయింది.

''బాబూ, నువ్వు ఎన్ని కష్టాలు పడైనా వకీలు కావల్సిందే. మనలాంటి పేదోళ్ళకింత న్యాయం జరిగేటట్లు చూడాల్సిందే'' అని పదే పదే గిరిధర్‌తో అనేవాడు తన తండ్రి.

''నమస్కారమండీ'' అన్నాడు జగన్నాథ్ లోపలికొచ్చి.

''నమస్కారం, కూచోండి'' చిరునవ్వుతో ఆహ్వానించాడు గిరిధర్. జగన్నాథం ఈ ఊళ్ళో బాగా ఉన్నవాళ్ళలో ఒకరు. మనిషి హుందాగా వున్నా, మొహం పాలిపోయి ఉంది. కళ్ళు పీక్కొనిపోయి ఉన్నాయి.

''మీరేం ఆలోచించారు?'' అడిగాడు గిరిధర్ క్షణమాగి.

''మీ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను'' అన్నాడు జగన్నాథం నిశ్చయంగా.

నిన్న ఇదే సమయంలో జగన్నాథం వచ్చాడు. చాలా హడావిడిగా ఆందోళనగా గిరిధర్‌ని కలిశాడు.

''మీకు నేను ఏవిధంగా సహాయపడగలను?'' అడిగాడు గిరిధర్, జగన్నాథం పరిస్థితిని అర్థం చేసుకొన్నవెంటనే.

''మా కుటుంబం కష్టాల్లో పడింది. మీరుమాత్రమే మమ్మల్ని సేవ్ చేయగలరు'' అన్నాడు జగన్నాథం తడబడుతున్న కంఠంతో, చిరుచెమటలతో తడిసిన మొహాన్ని చేరుమాలుతో తుడుచుకొని.

''ఏ విధంగా?'' అడిగాడు గిరిధర్ సాదరంగా.

''మీరు ఈ వూర్లోనేకాదు. మన రాష్ట్రంలోకూడా పెద్ద క్రిమినల్ లాయరని తెలిసి వచ్చాను'' అన్నాడు జగన్నాథం గిరిధర్ మొహంలోకి చూస్తూ.

''అసలువిషయం చెప్పండి''

''మీరు ఏ కేసు టేకప్ చేసినా విజయం మీదేనని కూడా విన్నాను''

''విజయం నాదికాదు, న్యాయానిది'' అన్నాడు గిరిధర్ ఉద్రేకంగా ఉత్సాహంగా.

''మీరు కోరినంత డబ్బిస్తాను. దయచేసి మా కేసుకూడా టేక్‌అప్ చేయండి'' అన్నాడు జగన్నాథం వినయంగా వేడుకోలుగా.

''అలాగే అసలు విషయం చెప్పండి. డాక్టర్ దగ్గర రోగాన్ని, లాయర్ దగ్గర వాస్తవాలు దాచకూడదు''.

''నాకు, నా ఆస్తికి వారసుడు నా ఒక్కగాని ఒక్క కొ..డు..కు'' కంఠం ఆర్ద్రమైంది. కళ్ళలో నీరునిలిచాయి. మాటలు పెగల్లేదు. అతని పరిస్థితి దయనీయ స్థితి గిరిధర్‌ని కదిలించాయి.

''చూడండి జగన్నాథంగారూ, అసలేం జరిగిందో ధైర్యంగా చెప్పండి''

''మీరే మమ్మల్ని కాపాడాలి'' అంటూ సడన్‌గా చేతులు పట్టుకున్నాడు.

''అసలేం జరిగింది?'' అడిగాడు అసహనంగా.

''నా... కొడు..కు ఒక రే..ప్ కేసులో ఇరుక్కున్నాడు''

''ఇరుక్కున్నాడా? చేశాడా?'' అడిగాడు గిరిధర్ సూటిగా.

''ఇరుక్కున్నాడు''

''జగన్నాథంగారూ నిజం చెప్పండి''

''ఉద్రేకంలో తొందరపడ్డాడు''

''అలా చెప్పండి, మీ అబ్బాయి వయస్సెంత?''



## వేలం

వేలంపాట జరుగుతూ ఉండగా అక్కడున్న కంగారావు బ్రీఫ్‌కేస్ పోయింది. అందులో పదివేల రూపాయలున్నాయి. వెంటనే అతను లేచి, ''నా బ్రీఫ్‌కేస్ వెతికి ఇచ్చినవాళ్లకి రెండు వేల రూపాయలు బహుమతిగా ఇస్తాను!'' అంటూ ప్రకటించాడు.

వెంటనే మరో గొంతు ''నేను మూడు వేల రూపాయలు ఇస్తాను!'' — అంటూ పాటను పెంచింది.

—జోకర్ (హైదరాబాద్)

''ఇరవై ఐదేళ్ళు''

''చదువుతున్నాడా?''

''బి.ఏ చదివి మానేశాడు''

''పెళ్ళిచేస్తే పోయేది, మనిషికి చేతినిండా పనిలేకపోతే ఇలానే తయారవుతారు''

''మీరు ఎలాగైనా మావాడ్ని రక్షించాలి''

''ఎలా రక్షించగలను? నేరం చేసినవాడు శిక్ష అనుభవించవలసిందే, ఇందులో మీ కొడుకైనా, నా కొడుకైనా ఒక్కటే''


''అంతమాటనకండి, వాడి జీవితంతో మా బతుకులు ముడిపడి ఉన్నాయి''

''ఒక లాయర్‌గా నేనేం చేయగలను? నేరం చేసింది వాస్తవం, నేరం చిన్నదేమీకాదు, ఒక జీవితానికి సంబంధించింది. నేరాన్ని ఒప్పుకొని, న్యాయస్థానానికి లొంగిపోతే శిక్ష తక్కువ పడేందుకు అవకాశముంది''

''చూడండి గిరిధర్‌గారు, మీకెంత డబ్బు కావాలన్నా ఇస్తాను. మావాడ్ని కాపాడి మమ్మల్ని ఈ ఉపద్రవంనుండి రక్షించండి''

''కోర్టులో అన్యాయాన్ని న్యాయంగా ఎలా వాదించగలను? అలా వాదించగలిగినవాడు నేను న్యాయవాదినికాదు, అన్యాయవాదినో, అవకాశవాదినో అవుతాను. డబ్బుకు కక్కుర్తిపడి ఇంతవరకు నేరస్థుడ్ని నిర్దోషిగా వాదించలేను. అది నా ప్రిన్సిపుల్స్‌కు వ్యతిరేకం. పైసాకూడా ఫీజు తీసుకోకుండా, నిర్దోషులతరఫున వాదించి గెలిచిన సందర్భాలు కోకొల్లలు. మా నాన్న న్యాయం కోసమే అష్టకష్టాలుపడి చచ్చిపోయాడు. నేను మా నాన్న కోరిక తీర్చడానికే లాయరునయ్యాను'' అన్నాడు బాధగా.

చచ్చిపోయేముందు గిరిధర్ తండ్రి చెప్పినమాటలు అతని చెవుల్లో ప్రతిధ్వనించాయి. హృదయంలో



చెలరేగాయి:

"న్యాయం కేవలం బజార్లో కొనుక్కొనే వస్తువుకాకూడదు. న్యాయవాదులు, డబ్బు ఎవరికెక్కువుందాని తూచే త్రాసులు కాకూడదు. న్యాయం పవిత్రమైంది.అది అందరికి అందుబాటులోవుండాలి. పేద, ధనికులనే విచక్షణ లేకుండా న్యాయాన్ని అందరూ పొందాలి. న్యాయం, నేరం రెండు కలిసే ప్రసక్తిలేదు. అవి రైలుపట్టాల్లాంటివి. గిరి నువ్వు లాయరువయ్యాక ఈ విషయాల్ని గుర్తుపెట్టుకో" అని చెప్పి తృప్తిగా గిరి కళ్ళలోకి చూస్తూ ప్రాణాలొదిలాడు గిరితండ్రి.

"చూడండి గిరిధర్‌గారూ, మీరింత సీరియస్‌గా తీసుకోకూడదు. ఇది ఒక బంగారు భవిష్యత్తుగల వ్యక్తియొక్క జీవిత సమస్య, మీరు విశాల దృక్పధంతో ఆలోచించాలి" అన్నాడు జగన్నాధం ప్రాధేయపడుతూ.

"న్యాయవాదులు, న్యాయస్థానాలు చట్టాన్ని, ధర్మాన్ని, న్యాయాన్ని ఉద్ధరించడానికి ఉద్దేశించబడ్డ యంత్రాంగం. న్యాయాన్ని అన్యాయంగా, అన్యాయాన్ని న్యాయంగా గుర్తించి గౌరవించడానికి కాదు" అన్నాడు గిరిధర్ ఉద్రేకంగా హుందాగా.

"మరి నన్నేం చేయమంటారు?" అడిగాడు జగన్నాధం దీనంగా.

"తండ్రిగా మీ బాధను అర్ధం చేసుకోగలను. కానీ లాయర్‌గా నాకు కొన్ని గురుతర బాధ్యతలున్నాయి"

జగన్నాధం నోరువిప్పలేదు. బాధగా తలవంచుకున్నాడు.

రేప్‌కు గురైన అమ్మాయిగురించి, తన తల్లిదండ్రుల బాధల గురించికూడా కాస్త ఆలోచించండి. రేప్ చేయబడ్డ అమ్మాయికి ఈ వ్యవస్థలో పెళ్ళవుతుందా? తన తల్లిదండ్రులకు జీవితాంతం గుండెల మీద కుంపటిగా మిగిలిపోదా?"

"కావాలంటే కోరినంత డబ్బిద్దాం"

"జగన్నాధంగారూ! డబ్బుతో మానాన్ని అభిమానాన్ని కొనలేమండి. అలాంటి సంఘటన మన అమ్మాయికే జరిగిందనుకోండి, అప్పుడు మన ప్రవర్తన, ప్రవృత్తి ఎలా ఉంటుంది? అనే వాస్తవ దృష్టితో, మానవతా దృక్పధంతో ఆలోచించండి. అమ్మాయికి జరిగిన అన్యాయానికి ఏ తల్లిదండ్రులైనా ఊరుకుంటారా? మీ అబ్బాయికి తగిన శిక్ష పడేలాగా చూడరా?" అన్నాడు గిరిధర్ ఉద్రేకపడిపోతూ.

"ఆ అమ్మాయి పేదపిల్ల, అంత శక్తి వాళ్ళ తల్లిదండ్రులకెక్కడిది?"

"అదా మీ ధైర్యం?" గిరిధర్‌కు నవ్వాగలేదు. వికృతంగా నవ్వాడు.

"పేదలుకూడా మనుష్యులండీ, వాళ్లకు మనలాగే హృదయం, ఉద్రేకం, అభిమానం అన్నీ ఉంటాయి. చిన్న చేపను పెద్దచేప, ఆ చేపను ఇంకా పెద్దచేప ఇలా మింగుతూపోతే అంతమెక్కడ? మన ప్రయోజనాలకోసం, క్షేమంకోసం ఏర్పరచుకున్న పరిధుల్లో మనం మనలేకపోతే, మనకు రక్షణ ఎలా ఉంటుంది? ఎవరు రక్షణ కల్పిస్తారు?" అన్నాడు సూటిగా.

జవాబులేదు. తలొంచుకున్నాడు జగన్నాధం.

"న్యాయానికి గీటురాయి డబ్బే అనుకుంటే నాకు అభ్యంతరం లేదు. మీరు డబ్బు పెడితే నా కంటే మంచిలాయరే దొరకవచ్చు. కానీ నాదొక విన్నపం."

ఏమిటీ! అన్నట్లు తలపంకించి చూశాడు జగన్నాథం.

"మనది పవిత్ర భూమి. గాంధీ పుట్టిన దేశం. ఈ సమస్య యే ఒక్కరిది గాకుండా యావత్ మానవ సమస్యగా ఆలోచించండి. ఒక పరిష్కారాన్ని సూచించండి. మీకు తీరికున్నప్పుడు ఇక్కడ కొచ్చి మీ అమూల్యమైన అభిప్రాయాన్ని తెలియజేస్తే సంతోషిస్తాను" అన్నాడు గిరిధర్ వ్యధతో బరువెక్కిన హృదితో. ఒక్కసారి గిరిధర్ మొహంలోకి చూసాడు., గబగబ లేచి వెళ్ళిపోయాడు. అప్పుడు వెళ్ళినవాడు మళ్ళీ ఈరోజే ప్రత్యక్షమయ్యాడు జగన్నాధం.

"మీరు నా అభిప్రాయంతో ఏకీభవిస్తున్నారు, అంతేనా?" నసిగాడు గిరిధర్.

"నేరం చేసినవాడు చట్టపరంగా, న్యాయబద్ధంగా శిక్ష అనుభవించవల్సిందే. న్యాయం దృష్టిలో అందరూ సమానమే" అన్నాడు జగన్నాధం దృఢంగా.

"జగన్నాధం గారూ మీరు మామూలు వ్యక్తులుకాదు, గాంధీజీ వారసులు" అన్నాడు గిరిధర్ ఆనందంతో ఉక్కిరిబిక్కిరైపోతూ.

జగన్నాధం ధనవంతుడు. సంఘంలో బలవంతుడు. పట్టుపడితే ఏదైనా సాధించగలడు. కానీ న్యాయానికీ చట్టానికి తలొగ్గాడు. ఏకైక సంతానాన్ని త్యజించడానికి సిద్ధపడ్డాడు. అతనిలోకలిగిన పరివర్తన అసామాన్యమైంది. అందుకే గిరిధర్ దృష్టిలో మహోన్నతంగా నిలిచాడు. జగన్నాధం వ్యక్తిత్వానికి గిరిధర్ మనసులో జోహారులర్పించాడు. చట్టం పరుధుల్లో అతనికి సహాయం చేయాలని నిశ్చయించుకున్నాడు గిరిధర్.

"ప్రస్తుతం మీ అబ్బాయి ఎక్కడున్నాడు?" అడిగాడు గిరిధర్.

"పోలీసు కస్టడీలో" జవాబిచ్చాడు జగన్నాధం నిండుగా, నిశ్చలంగా.

"బెయిల్ తీసుకోలేదా?"

"లేదు"

"ఎందుకని?"

"వాడు నేరం చేసింది నిజం కనుక"

"మీరు ఏమీ అనుకోకపోతే ఒక సలహా"

"ఏమిటది"

"కన్నెపిల్ల శీలం అపహరించాడు కాబట్టి... ఆమె భర్త మీ అబ్బాయే"

"అదెట్టా?"

"ఏముంది, ఆ అమ్మాయి తల్లిదండ్రులను ఒప్పించి, మీ అబ్బాయి మెడకు ఆ అమ్మాయిని కట్టడమే. మీ అబ్బాయి చేసిన నేరానికి సరైన శిక్ష.

జగన్నాధం పెదాలమీద చిన్న నవ్వొకటి మెరిసింది.

"ఈ పరిష్కారం వాస్తవంగామా, సంప్రదాయసిద్ధంగాను వుంది. కా..నీ..."

"మీ అబ్బాయి అంగీకరించడా?" అడిగాడు గిరిధర్ అనుమానంగా.

"వాడికి గత్యంతరమేముంది? లేకపోతే జైలుశిక్షేగా. మన స్వార్ధంతో ఆ అమ్మాయికి అన్యాయం చేస్తున్నామేమోనని"

"మనం తలపెట్టిందే సరైన న్యాయం. ఆ అమ్మాయికి జరిగిన నష్టానికి సరైన పరిహారం చెల్లిస్తున్నాం. ఒకవేళ మీ అబ్బాయిని చట్టం శిక్షించినంత మాత్రాన ఆ అమ్మాయికి ఒరిగేదేముంది?

"సరే అలాగైతే నా ఆస్థిలో సగం భాగం అమ్మాయిపేరా రాస్తాను. ఆమెకు భవిష్యత్తులో ఆమెకు రక్షణగాకూడా ఉంటుంది" అన్నాడు జగన్నాధం హుషారుగా.

ఆ అభిప్రాయం, ఆలోచన గిరిధర్‌కు నచ్చింది.

"సరే మీ ఇష్టం రేపటినుండి ఈ వ్యవహారం చూద్దాం. మీరు పెళ్ళికి మంచి ముహూర్తం నిశ్చయించండి పనిలోపనిగా" అన్నాడు గిరిధర్ ముసిముసిగా నవ్వుతూ.

"శుభస్య శీఘ్రం" అన్నాడు జగన్నాధం కుర్చీలోంచి లేస్తూ.

జగన్నాధం మొహంలో సంతోషం సంతృప్తి వెల్లివిరిసాయి. గిరిధర్ ఇంకొక క్రిమినల్‌కేసు గెలిచాడు. క్రెడిట్‌తో తృప్తిగా గాలి పీల్చాడు.

జగన్నాధం కొడుకు రేప్ చేసింది కొండయ్య కూతురు మల్లిని. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో వుంది. గిరిధర్ అధీనంలోనే మల్లి ట్రీట్‌మెంట్ తీసుకొంటుంది. పాపం కొండయ్యకు ఈ విషయాలన్నీ తెలియవు. లాయర్ గిరిధర్ లీలల గురించి అసలే తెలియదు.

*

